# వందశాతం పూర్తి చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

- ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి
- సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 20 : సిద్దిపేట జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూళ్లు ఈ ఆర్థిక సంవత్సరం (2023–24) వంద శాతం జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మున్సిపాలిటీ కమిషనర్లను ఆదేశించారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో సిద్దిపేట, గజ్వేల్–ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల మున్సిపాలిటీ కమిషనర్లు, మున్సిపల్ అధికారులతో ఆస్తి పన్ను వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో నిర్మాణ దశలో ఉన్న పలు భవనాల నిర్మాణం, పురోభివృద్ధిపై ఆరా తీసి, పెండింగ్‌లో ఉన్న పలు భవనాల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ప్రతి మున్సిపల్ కమిషనర్ ఆయా మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో పర్యటించి చెత్త సేకరణ, డంపింగ్ యార్డులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిపై జరిమానాలు విధించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వైకుంఠధామాల పనులు వెంటనే చేపట్టాలన్నారు. జిల్లాలో వానకాలం నాటికి హరితహారం కార్యక్రమానికి సంబంధించి నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. ఇప్పటికే అన్ని మున్సిపాలిటీలకు బ్యాగులను అందజేశామని, ఆ బ్యాగుల్లో మట్టిని నింపే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలో పనులన్నీ లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు సంపత్‌కుమార్, విద్యాధర్, గణేశ్, రాజశేఖర్, రాజేంద్రకుమార్, మెప్మా పీడీ హనుమంత్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ సదస్సులో గజ్వేల్ లెక్చరర్‌కు గుర్తింపు



లెక్చరర్ లావణ్య

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 20 : మధ్యప్రదేశ్‌లోని మహాకౌశల్ యూనివర్సిటీ, థాయిలాండ్ దేశం సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ తుమ్మ లావణ్య సమర్పించిన పరిశోధన పత్రాలు ఉత్తమ పరిశోధన పత్రాలుగా ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని మహాకౌశల్ యూనివర్సిటీ 'థాయిలాండ్ సస్టైనబుల్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్' అనే అంశంపై ఈ నెల 17న అంతర్జాతీయ సదస్సు నిర్వహించాయి. ఈ సదస్సులో ఇండియా, థాయిలాండ్, బ్యాంకాక్ దేశాల నుంచి దాదాపు 109 మంది పాల్గొన్నారు. గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ తుమ్మ లావణ్య గ్రామీణ వ్యవసాయంలో 'మహిళా సాధికారత ప్రభావం–ఏ కేస్ స్టడీ ఇన్ గజ్వేల్' అనే పరిశోధనా పత్రాన్ని సమర్పించగా, ఈ పత్రాన్ని సదస్సు నిర్వాహకులు ఉత్తమ పరిశోధన పత్రంగా ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా లెక్చరర్ లావణ్యను కళాశాల బృందం అభినందించారు.

## నేటి నుంచి వినియోగదారుల సమావేశం

-ట్రాన్స్‌కో ఎస్ఈ జానకీరామ్

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 20: వినియోగదారుల సమస్యలు పరిష్కరించడంతోపాటు సేవలు మెరుగుపర్చుకోవడానికి జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో వినియోగదారులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ జానకీరామ్ తెలిపారు. మెదక్ పట్టణం, హవేళీఘనపూర్, తూప్రాన్, కౌల్కల్‌లో ఈ నెల 21న మధ్యాహ్నం 2 నుంచి 4:30 వరకు, చిన్నశంకరంపేట, శివ్వంపేట మండల కేంద్రాల్లో 22వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 4:30 వరకు, 23న కొల్చారం, వెల్దుర్తి మండల కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి 4:30 వరకు, 27న నర్సాపూర్, మాసాయిపేట మండల కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి 4:30 వరకు, 28న చిలిపిచెడ్, చేగుంట మండల కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి 4:30 వరకు, 29న కౌడిపల్లి, రామాయంపేట మండల కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి 4:30 వరకు, జనవరి 2న పాపన్నపేట, నిజాంపేట, నార్సింగి మండల కేంద్రాల్లో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు, జనవరి 3న పెద్దశంకరంపేటలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు, జనవరి 3న అల్లాదుర్గం, రేగోడ్ మండల కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4:30 వరకు సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను రాత పూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

## క్రీడారంగంలోనూ ఉజ్వల భవిష్యత్

-అంతకపేటలో 8వ జిల్లా స్థాయి రోడ్ రేస్ సైక్లింగ్ పోటీలు



జిల్లా స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్సై వివేక్, వెంకనర్సయ్య

అక్కన్నపేట, డిసెంబర్ 20 : క్రీడారంగంలోనూ ఉజ్వల భవిష్యత్ ఉందని, క్రీడల్లో రాణిస్తే సమాజంలో చక్కటి గుర్తింపు, గౌరవం లభిస్తున్నదని అక్కన్నపేట ఎస్సై వివేక్ అన్నారు. బుధవారం మండలంలోని అంతకపేటలో 8వ జిల్లా స్థాయి రోడ్ రేస్ సైక్లింగ్ ఎంపిక పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. 'ఆరోగ్యంతోపాటు ఆటలు' అనే నినాదం మేరకు ప్రతిఒక్కరూ శారీరక వ్యాయామం చేయాలని సూచించారు. జిల్లా స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 80 సైక్లింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. కాగా, అండర్ 14, 16, 18 విభాగాల్లో మాస్టర్, టైం ట్రావెల్‌ల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగపల్లి వెంకటనర్సయ్య, మండల నోడల్ ఆఫీసర్ రంగా, అంతకపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా ఆర్థిక కార్యదర్శి చింతకింది శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ రజిత, ఖేలో ఇండియా శిక్షకుడు సంజీవ్, పీఈటీలు సుధారాణి, వీరస్వామి పాల్గొన్నారు.

**రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు..**

జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బండారుపల్లి శ్రీనివాస్, జంగపల్లి వెంకటర్సయ్య తెలిపారు. అంతకపేటలో జరిగిన సైక్లింగ్ ఎంపిక పోటీల్లో అండర్ 14, 16 బాలబాలికల విభాగాల్లో రిజ్వాన, వర్షిత, లిఖిత, కావ్య, హారిక, సిరిచందన, రవళి, దుర్గ, స్నేహ, నిఖిల్, పవన్, సుప్రీత్, ప్రసాద్, చరణ్, సుమిత్, జస్వంత్, హర్షవర్ధన్, ఉల్లుప్రసాద్, రఘువంశీ గెలుపొందగా, వీరు జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు.

## చేపల వేటకు వెళ్లి తండ్రీకొడుకు మృతి

హత్నూర, డిసెంబర్ 20 : చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి తండ్రీకొడుకు మృతిచెందిన ఘటన హత్నూర మండలం సాదుల్లానగర్ గ్రామంలో జరిగింది. బుధవారం బాధిత కుటుంబీకుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెక్కల ప్రభు (46), చెక్కల నాగరాజు (23) తండ్రీకొడుకులిద్దరూ మంగళవారం సాయంత్రం తుర్కలఖానాపూర్ శివారులోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి చేపల కోసం వేసిన వలలో పడి మృతిచెందారు. విషయం తెలుసుకున్న హత్నూర ఎస్సై సుభాష్ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం కోసం నర్సాపూర్ ఏరియా దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి నర్సాపూర్ ఏరియా దవాఖానకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం అందేలా చూస్తానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.




సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

## టీడీఎస్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 20 : టీడీఎస్ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. ఆదాయపన్ను, టీడీఎస్ నిబంధనలపై డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు అవగాహన కలిగినప్పుడే టీడీఎస్ రిటర్న్స్ నిర్ణీత సమయంలో సమర్పించగలుగుతారని పేర్కొన్నారు. హైదరాబాద్ ఆదాయపు పన్నుశాఖ టీడీఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని అన్ని శాఖల డీడీఓలకు ఆదాయపు పన్ను, టీడీఎస్ నిబంధనలపై వర్క్‌షాప్ నిర్వహించారు. హైదరాబాద్ ఆదాయ పన్నుశాఖ అధికారి మానస్ రంజన్ మాట్లాడుతూ నిర్ణీత సమయంలోగా కరెక్ట్ టీడీఎస్ రిటర్న్స్ సమర్పించాలన్నారు. టీడీఎస్ రిటర్న్ మొదటి క్వార్టర్‌కు సంబంధించి జూలై 31లోగా, రెండో క్వార్టర్ అక్టోబర్ 31, మూడో క్వార్టర్ జనవరి 31, నాలుగో క్వార్టర్ తదుపరి ఫైనాన్షియల్ ఇయర్ మే 15లోగా సమర్పించాలని వివరించారు. టీడీఎస్ రిటర్న్స్ దాఖలు చేయడంలో ఎలాంటి సమస్యలు ఉన్నా www. tdscpc. gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని లాగిన్ అయి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఆదాయపు పన్ను, టీడీఎస్ నిబంధనలు, ఫైలింగ్ ఏవిధంగా చేయాలి, రిటర్న్స్ ఎప్పటిలోగా సమర్పించాలి అనే తదితర అంశాలపై వివరించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా hyderabad.ito. tds1.4@ incometax.gov.inకు ఈ–మెయిల్ చేయవచ్చన్నారు. టీడీఎస్‌కు సంబంధించిన అన్ని సందేహాల నివృత్తికి డీడీఓలు తమ సిబ్బందిని హైదరాబాద్‌లోని ఏసీ గార్డ్స్ వద్ద గల ఇన్‌కమ్ ట్యాక్స్ టవర్ నాలుగో అంతస్తులోని జాయింట్ కమిషనర్ కార్యాలయంలో ప్రతినెలా మూడో బుధవారం సాయంత్రం 3 నుంచి 5 వరకు నిర్వహించే టీడీఎస్ శిక్షణకు పంపవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ అధికారి కవిత, హైదరాబాద్ ఆదాయపు పన్ను శాఖ అధికారి పావల్, జిల్లాలోని అన్ని శాఖల డీడీవోలు పాల్గొన్నారు.

## జాతీయ, రాష్ట్రస్థాయిలో రాణించిన 'తారా' విద్యార్థులు

అభినందించిన కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 20: జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొన్న తారా ప్రభుత్వ కళాశాల విద్యార్థి పవన్‌ను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎస్ రత్నప్రసాద్, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదురైలోని కామరాజు విశ్వవిద్యాలయంలో ఈ నెల 11 నుంచి 17 వరకు జరిగిన జాతీయ సమైక్యతా శిబిరంలో బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థి పవన్‌గౌడ్ పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ఇటీవల గాంధీ దవాఖానలో జరిగిన రాష్ట్రస్థాయిలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు చేసిన డ్రామా కాంపిటీషన్‌లో తమ కళాశాల విద్యార్థులకు తృతీయ బహుమతి కింద రూ.5వేల నగదు పురస్కారం రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రస్థాయిలో మూడో బహుమతి గెలుపొందిన బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థి అంజలి బృందాన్ని ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు ప్రవీణ, డాక్టర్ వెంకటేశం, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వెంకటేశం, డాక్టర్ పద్మజ, డాక్టర్ సిద్ధులు, డాక్టర్ అభిజిత్, అధ్యాపకులు రాజేంద్రకుమార్, రతన్ కుమార్ పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి ఎయిడ్స్ అవగాహన పోటీల్లో గెలుపొందిన విజేతలను అభినందిస్తున్న అధ్యాపక బృందం

# భూ సర్వేను అడ్డుకున్న గ్రామస్తులు

- రాయపోల్‌లో ఉద్రిక్తత
- భారీగా పోలీసుల మోహరింపు
- అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం



రాయపోల్‌లో సర్కార్ తోట భూ సర్వే వివరాలు తెలుసుకుంటున్న గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్

రాయపోల్, డిసెంబర్ 20 : మండల కేంద్రంలోని సర్కారు తోటగా పిలుస్తున్న భూమిపై కొంతకాలంగా గ్రామస్తులు, పట్టాదారులకు మధ్య వివాదం కొనసాగుతున్నది. గతంలో పట్టాదారుడు ఐదెకరాల భూమిని ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ చేశారు. బుధవారం భూ సర్వేకు రెవెన్యూ అధికారులు రావడంతో గ్రామస్తులు ఆగ్రహించి సర్వేను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, గ్రామస్తులకు తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకున్నది. సర్పంచ్‌తోపాటు పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామంలోని సర్కార్ తోట భూమిని ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించుకోవాలని తాము కొన్నేండ్ల నుంచి ఉద్యమిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, రాయపోల్ తహసీల్దార్‌ను అడ్డుకున్నారు. సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి, తొగుట సీఐ కమలాకర్ ఆధ్వర్యంలో ఎలాంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు. సర్కార్ తోట భూమిలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, లేకపోతే అన్ని పార్టీల నాయకులతో కలిసి ఆందోళన చేపడుతామని గ్రామస్తులు తెల్చిచెప్పడంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.